స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు

కేటీదొడ్డి, ఆగస్టు 10: వచ్చే రెండునెలల్లో పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు సిద్ధమవ్వాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు సూచించారు. మండలంలోని పాగుంట వెంకన్న ఆలయం వద్ద కేటీదొడ్డి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి ఎన్నికల్లో విజయం సాధించే విధంగా వ్యూహం రచించాలని సూచించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన మేలు మనం మర్చిపోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవ్వరికీ నచ్చట్లేదని.. అది మీ అందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండుంటే ఈపాటికి రైతుబంధు డబ్బులు పడేవన్నారు. వానకాలం పంట వేసి రెండునెలలైనా రైతుబంధు డబ్బులు పడలేదని విమర్శించారు. అందరి వెంట నేను ఉంటానని, మీ అందరి సహకారం కావాలన్నారు. ఎవరి నుంచైనా మీకు ఆపద ఉంటే నాకు ఫోన్ చేయాలన్నారు. మున్ముందు మంచిరోజులు వస్తాయన్నారు. అంతకుముందు ఆయన పాగుంట వెంకన్నస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మోనేశ్, రాము, శేఖర్‌నాయుడు, తిరుమల్, గోవిందు, జగదీశ్, కిషన్‌రెడ్డి, రవి, రాజునాయుడు, కామేశ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి మండల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బాసు హనుమంతునాయుడు

ర్యాలంపాడు కాల్వ పరిశీలన

కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి, ఆగస్టు 10: మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ కాలువలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయి నీటిమట్టం నాలుగు టీఎంసీలని కానీ 1.30 టీఎంసీల నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని త్వరలో నిపుణుల కమిటీ వేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ వైఎస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గద్వాల అర్బన్, ఆగస్టు 10: జిల్లా కేంద్రంలోని వివిధ వార్డుల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. మొత్తం 44మంది లబ్ధిదారులకు దాదాపు రూ.15.65 లక్షల చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్ తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 10: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాగవరం వద్ద లైట్, హెవీ వెహికిల్స్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం, లారీ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంట్లో చేసుకునే ప్రతి వేడుకల్లో ప్రతిఒక్కరూ ఐదు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో లైట్ హెవీ వెహికిల్స్ మెకానికల్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ ఆయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చందర్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణ, కౌన్సిలర్లు ఉన్నారు.

రాజభవనం పరిశీలన

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల రాజబంగ్లాను ఎమ్మెల్యే మేఘారెడ్డి శనివారం సందర్శించారు. రాజప్రసాదంలోకి వర్షపు నీరు రావడాన్ని పరిశీలించారు. సీసీరోడ్ల నిర్మాణాలు ఎత్తుగా వేయడంతో వర్షపు నీరు చేరిందని, వర్షపు నీరు రాకుండా ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. నీటి పారుదల శాఖ డ్యాం సేఫ్టీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సహాయ, సహకారాలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైర్మన్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, చంద్రమౌళి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అలాగే సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు జిల్లా కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే మేఘారెడ్డి పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, ఆగస్టు 10: మండల కేంద్రానికి చెందిన మూవీ డైరెక్టర్ జానకీరామ్ (44) ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఈనెల 5న హైదరాబాద్‌లో మృతి చెందాడు. శనివారం మండల కేంద్రంలో మృతుడు జానకీరామ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జి మంద సత్యశీలారెడ్డి, నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నంబావి, ఆగస్టు 10: మండలంలోని వెలగొండకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దేవుని వరలక్ష్మి, వెంకటయ్య సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరు కాగా.. ఇంటింటికి వెళ్లి అందజేసినట్లు నాగరాజు, మహదేవ్‌గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, ఆగస్టు 10: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా వనపర్తి డిగ్రీ కళాశాలలో కామర్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, మైక్రో బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 13న డెమో, ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించాలని, అధిక విద్యార్హతలు ఉన్నవారికి ప్రాధాన్య ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

Before the Hon'ble Arbitrator /
Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.126 of 2024
Between
NEESTHAM CHITS (P) LTD., BR. Mahabubnagar ... Disputant
And
Mudavath Perumallu and others ... Opponents
To
NOTICE
1) Mudavath Perumallu S/o M. Poorya, aged 42 years, Occ: Technical Asst., Rural Development Services of Mandal Parishad Development Officer, Weepangandla of Nagarkurnool Dist., R/o H.No.4-62, Annaram thanda, Pangal Mdl., Wanaparthy Dist.,
2) Kethavath Umavathi W/o Perumallu.M, aged 32 years, Occ: Teacher at UPS Laxmipally Vg., of Chinnambavi Mdl, Wanaparthy Dist. R/o H.No.4-62, Annaram thanda, Pangal Mdl, Wanaparthy Dist.,
3) Mudavath Ramesh S/o M. Naanya, aged 42 years, Occ: Police Constable No.2359, O/o Police Station Goplapet Vg., & Mdl, of Wanaparthy Dist. R/o H.No. 3-15, Dattaipally Vg., of Wanaparthy Dist., 509 120. ... Opponents
Claim for Recovery of Rs.1,35,484/- (Rupees One Lakh Thirty five Thousand Four hundred Eighty four only)
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on 24-08-2024 at 11-30A.M. for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

ముగిసిన సప్తాహ భజనలు

మల్లకల్, ఆగస్టు 10: మండల కేంద్రంలోని ఆదిశిలాక్షేత్రంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వారం రోజులుగా నిర్వహించిన సప్తాహ భజనలు శనివారంతో ముగిశాయి. గత శనివారం ఉదయం 11:45 గంటలకు ప్రారంభమైన భజనలు శనివారం ఉదయం 11:45 గంటలకు ముగిశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్, ఈవో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. గద్వాలలోని కృష్ణానది నుంచి పూజారులు, భక్తులు, కాలినడకన శనివారం తెచ్చిన జలాలకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, అరవిందరావు, బాబురావు, గ్రామపెద్దలు, గ్రామస్తులు భాజాభజంత్రీలతో బస్టాండ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్‌లకు నదీజలాలతో అభిషేకాలు చేశారు. భక్తులకు శేషంపల్లి నర్సింహులు దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతను చైర్మన్, ఈవో స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు. ఏడురోజులపాటు సేవలందించిన అలంపూర్, గద్వాల నియోజకవర్గంలోని భజన మండళ్ల సభ్యులను స్వామివారి శేష వస్త్రాలు, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిమొక్కనూ సంరక్షించాలి

పాన్‌గల్, ఆగస్టు 10: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని మాజీ జెడ్పీటీసీ రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు పెంచితేనే పర్యావరణం సమతుల్యం ఏర్పడి జీవికోటి మనుగడకు సాధ్యమైతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా నెట్టెంపాడ్ జలాలు

అయిజ వద్ద వాగులో పారుతున్న నెట్టెంపాడ్ జలాలు

అయిజ, ఆగస్టు 10: రిజర్వాయర్లు, చెరువులను నింపి ఆయకట్టుకు పారాల్సిన నెట్టెంపాడ్ జలాలు వాగుల్లో వృథాగా పారుతున్నాయి. నడిగడ్డలో ప్రధాన సాగునీటి వనరు నెట్టెంపాడ్ ప్రాజెక్టు. నెట్టెంపాడ్ ప్రాజెక్టు ద్వారా ముచ్చోనిపల్లి, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లతో పాటు ప్రధాన చెరువులను నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ర్యాలంపాడ్ రిజర్వాయర్ ద్వారా నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు చేరాల్సిన జలాలు డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా వాగులు, వంకలకు చేరుతున్నాయి. అయిజ పట్టణానికి సమీపంలోని పెద్దవాగులో నెట్టెంపాడ్ జలాలు వృథాగా పారుతున్నాయి. దీంతో పంట పొలాలకు చేరాల్సిన నీరు వాగులు, వంకల ద్వారా తుంగభద్ర నదిలోకి చేరుతున్నాయని అయిజ రైతు సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి వాపోయారు. రిజర్వాయర్లను నింపాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోక పోవడంతో నెట్టెంపాడ్ నీరు వాగుల్లో పారుతూ వృథాగా వెళ్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథాగా పారుతున్న నీటిని అరికట్టి పొలాలు, రిజర్వాయర్లకు చేరేలా చూడాలని కోరారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

కొత్తకోట, ఆగస్టు10: కేరళ రాష్ట్రంలోని వరదలలో అతలాకుతలమైన వయనాడు ప్రాంతానికి శనివారం పట్టణంలోని వ్యాపారుల నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ భవన నిర్మాణ తాపీ కార్మికుల ఆధ్వర్యంలో వయనాడు బాధితులకు విరాళాలు సేకరించినట్లు పేర్కొన్నారు. వయనాడ్ ప్రజలు వరదల్లో సర్వం కోల్పోయారని వారిని ఆదుకోవడం మానవతాదృక్పతమని తెలిపారు. కార్యక్రమంలో పీజీ శ్రీను, అస్కాని శ్రీను, జనార్దన్‌సాగర్, ఆశన్న, వెంకటయ్య, గొల్ల వెంకటయ్య, కురుమన్న, కుర్మయ్య, బాలకృష్ణ, నాగన్న, రాములు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

● వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, ఆగస్టు 10: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ వస్తున్నామని, అయినప్పటికీ ఎవ్వరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలేదని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారని, తల్లిదండ్రులు తమ మైనర్లకు వాహనాలు ఇస్తున్నారని, ట్రిపుల్ రైడింగ్, అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్లడం , రోడ్లపైనే ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కనీస అవగాహన లేకుండా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా, నెంబర్ ప్లేట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్, వాహనాలను అతివేగంగా అజాగ్రత్తగా నడిపడం వంటి నేరాలకు పాల్పడుతూ చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి చట్టం పరిధిలో గౌరవంగా జీవించాలని సూచించారు.

ఆలయ ఆస్తులపై ప్రజాభిప్రాయ సేకరణ

ధరూరు, ఆగస్టు 10: మండలంలోని నెట్టెంపాడు సమీపంలో కృష్ణానది మధ్యలో ఉన్న నారదగడ్డ చెన్నబసవేశ్వర స్వామి ఆలయ ఆస్తులకు సంబంధించి శనివారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. 18ఏండ్ల కిందట కర్ణాటకకు చెందిన సిర్పూర్ తాలూకా కొటేకల్ మఠం దేవస్థానానికి చెందిన శివకుమార్ అనేస్వామి నారదగడ్డ ఆస్తులన్నీ నాకే చెందుతాయని హైకోర్టులో కేసు వేశాడు. ఇందుకు వ్యతిరేకంగా ఏపీలోని అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన చెన్న బసవేశ్వరస్వామి రిట్ దాఖలు చేశారు. ఇందుకుగానూ హైకోర్టు రాయిచూరు కలెక్టర్, తాసీల్దార్‌కు ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం కలెక్టర్ నితీశ్, అదనపు కలెక్టర్ మహబూబ్‌బీ, తాసీల్దార్ సురేశ్ ఆలయానికి చేరుకుని ప్రజాభిప్రాయ సేకరణ చేయగా.. భక్తులు ఉరవకొండకు చెందిన చెన్నబసవేశ్వరస్వామినే నారదగడ్డ పీఠాధిపతిగా ఉండాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయాన్ని హైకోర్టుకు తెలుపనున్నట్లు పేర్కొన్నారు. కార్యకరమంలో ధరూరు మండలంలోని గార్లపాడు, నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, చింతరేవుల, కర్ణాటకలోని పెద్దకురం, అనుకొండ, బూడిదపాడు, సర్జాపురం, యాపదిన్నె, గాజులపాడు ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయిచూరు కలెక్టర్ నితీశ్‌కుమార్

ఎడ్లబండిపై కలశం, ఫలహారం ఊరేగింపు

అయిజ, ఆగస్టు 10: వరుణుడు కరుణించి పాడిపంటలు సమృద్ధిగా పండాలని పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం పట్టణంలోని రైతులు, భక్తులు భాజాభజంత్రీలు, మేళ తాళాల నడుమ కలశం, ఫలహారాన్ని ఎడ్లబండిపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న రైతులు, భక్తులు కృష్ణా, తుంగభద్ర జలాలతో కట్టకింద తిమ్మప్పస్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా శ్రావణమాసం మొదటి శనివారం వరుణుడు కరుణించాలని ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని రైతులు పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలోని పాత పోలీస్టేషన్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 10 ఎడ్లబండ్లతో కలశం, ఫలహారంను ఊరేగింపుగా కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గ్రామంలోకి చేరుకొని ఫలహారాన్ని భక్తులకు పంచిపెట్టారు.

తిమ్మప్ప ఆలయానికి ఎడ్లబండ్లపై ఫలహారం తీసుకెళ్తున్న భక్తులు

పోరాటాల వల్లే విజయాలు

వనపర్తి టౌన్, ఆగస్టు 10: అనేకమంది ఉద్యమ నేతల పోరాటాల వల్లనే ఉపాధ్యాయుల హక్కులు నెరవేరుతున్నాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య అన్నారు. యూటీఎఫ్ ఏర్పడి 50ఏండ్లయిన సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ హనుమంతు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంఘం లేనినాటి నుంచి కోర్టు ద్వారా సాధించి ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించారన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావించే యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. విద్యారంగాన్ని రక్షించుకోవడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, రామన్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రాము, ఆంజనేయులు, వెంకటేశ్, అయోధ్యరాములు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ట్రాక్టర్ బోల్తా:యువకుడి మృతి

వడ్డేపల్లి, ఆగస్టు 10: మండలంలోని బుడమొర్సుకు చెందిన ఉప్పరి పరమేశ్(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుడమొర్సు నుంచి శనివారం ట్రాక్టర్‌పై బయలుదేరగా.. కర్నూలు దాటాక పాణ్యం సమీపాన మధ్యమార్గంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డుప్రమాదంలో ఏఎన్ఎంకు గాయాలు

కొత్తకోట, ఆగస్టు10: మండలంలోని పామాపురం సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తూ ఏఎన్ఎం ప్రమాదానికి గురై ఘటన శనివారం చోటుచేసుకున్నది. అప్పరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పామాపురంలో విధులు ముగించుకుని వేరేవారి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. టైర్ల మధ్యలో చీర పడగా.. ఏఎన్ఎం కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి దవాఖానకు తరలించారు.

ఉధృతంగా కృష్ణానది

పెబ్బేరు, ఆగస్టు 10: ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో కృష్ణానదిలో నీటి ఉధృతి తగ్గడం లేదు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదతో నదినిండుగా ప్రవహిస్తోంది. పెబ్బేరు మండలం రంగాపురం వద్ద కృష్ణమ్మ పరవళ్లు ఆకట్టుకుంటున్నాయి. నది పైనున్న రెండు వంతెనల కింద నుంచి జల సవ్వడి చేస్తూ శ్రీశైలానికి పరుగులు పెడుతున్నాయి. వంతెనలపై వెళుతున్న ప్రయాణికులను నదీ ప్రవాహం కట్టిపడేస్తోంది.

రంగాపురం వద్ద కృష్ణానదిలో వంతెనల కింద వరద ప్రవాహం

ప్రతిఎకరాకూ సాగునీరందిస్తాం

గోపాల్‌పేట, ఆగస్టు 10: రైతులకు రాబోయే కాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఎకరాకు సాగు నీరందేలా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం ఆయన రైతలకు సాగునీటి వసతులను తెలుసుకునేందుకు పార్టీ నాయకులు, రైతులతో కలిసి రేవల్లి మండలంలోని కేఎల్ఐ కాల్వతోపాటు డిస్ట్రిబ్యూటర్ కాల్వలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా తల్పునూరు తండా, కేశంపేటపాత తండాకు దాదాపు 2,500 ఎకరాలకు సాగునీటి వసతి లేదని రైతులు తమకు ఎలాగైనా సాగునీటి వసతి కల్పించాలని ఎమ్మెల్యేను కోరగా.., క్షేత్రస్థాయిలో అధికారులతో మాట్లాడి తొందరలోనే సాగునీరందే విధంగా సర్వే చేయమని సూచించారు. అదేవిధంగా డిస్ట్రిబ్యూటర్ కాల్వ గుండా నీరు వెళ్లనిచోట కాల్వ ఎత్తు పెంచి నీటిని పంపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వానకాలం సీజన్‌లో రేవల్లి, తల్పునూర్ మధ్య ఉన్న డి-5 కాల్వపై బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. రేవల్లి రైతలందరికీ సాగునీరందే విధంగా కాల్వలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గొల్లపల్లిలో 19మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కేశంపేటలో అనారోగ్యానికి గురైన రిపోర్టర్ దామోదర్‌ను పరామర్శించారు.

తపాలా పథకాలను సద్వినియోగించుకోవాలి

ఉండవెల్లి, ఆగస్టు 10: తపాలా శాఖ అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాఖ సహాయ పర్యవేక్షుడు సైదానాయక్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని ఇటిక్యాలపాడులో శనివారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగాంపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ.. చిన్నపిల్లల నుంచి అన్నివర్గాల ప్రజలందరికీ తపాలా శాఖ ద్వారా పొదుపు, బీమా, ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉండవెల్లి సబ్‌పోస్ట్‌మాస్టర్ ఇమామ్, ఎంవో సుధాకర్, గ్రామ పోస్ట్‌మాస్టర్ రాంగోపాల్, మాజీ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి, సతీశ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ: వ్యక్తి మృతి

గోపాల్‌పేట, ఆగస్టు 10: ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని బుద్దారం గండి సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లికి చెందిన గుజ్జుల మార్కెండేయ(38) సొంత పనిమీద బైకుపై బుద్దారం వెళ్లి, తిరుగు ప్రయాణంలో మమ్మాయిపల్లికి వస్తుండగా, బుద్దారం గండి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైకును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైకుపై వెళ్తున్న మార్కెండేయ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా బస్సును నడపడంతోనే తన కొడుకు మృతిచెందాడని మృతుడి తల్లి గుజ్జుల మణెమ్మ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొబైల్ అప్పగింత

బాధితుడికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై

పెబ్బేరు, ఆగస్టు 10: శ్రీరంగాపురం పోలీసులు ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీ సాయంతో తిరిగి బాధితుడికి అప్పగించారు. నెల రోజుల కిందట సూగూరుకు చెందిన రాముడు తన ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను కనిపెట్టి తిరిగి శనివారం పోలీస్టేషన్‌లో ఫిర్యాదుదారుడికి అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

జాతీయ జెండాను ఆవిష్కరించాలి

అయిజ, ఆగస్టు 10: హర్ ఘ